సాక్షి ప్రకాశం

గురువారం । 19 । అక్టోబర్ । 2023

I



ఖైదీల్లో పరివర్తన ప్రధానం

జైల్లో ఉన్న ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. ఒంగోలు జిల్లా జైలును ఆయన పరిశీలించారు.

- IIలో..



టిప్పర్ ఢీకొని మహిళ దుర్మరణం

స్కూటీని వెనుకనే వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో మహిళ మృతిచెందిన ఘటన సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక సమీపంలో జరిగింది.

- IIలో..

గరిష్టం/కనిష్టం
35.8/25.8

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పశు వైద్యాధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా బత్తుల బాలకృష్ణ



డాక్టర్ బత్తుల బాలకృష్ణ

కనిగిరి రూరల్: పశు వైద్యాధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా కనిగిరికి చెందిన పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన కనిగిరిలో విలేకర్లతో మాట్లాడుతూ నూతన కమిటీ వివరాలను వెల్లడించారు. పశువైద్యాధికారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.కాశీ విశ్వనాథరెడ్డి, సహాయ అధ్యక్షులుగా డాక్టర్ కే సాహితి, డాక్టర్ ఎం రాంబాబు, డాక్టర్ బాలు నాయక్, కోశాధికారిగా యు చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ టీ అనుషా, డాక్టర్ కేవీ రాజశేఖర్, డాక్టర్ వీవీ సాయి చక్రవర్తిలను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బత్తుల బాలకృష్ణ మాట్లాడుతూ పశువైద్యాధికారుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు వైద్యులు, స్థానిక నాయకులు డాక్టర్ బాలకృష్ణను అభినందించారు.

పెయ్య దూడల పథకంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కే బేబీ రాణి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి బేబిరాణి

ఒంగోలు సెంట్రల్: పాడి రైతులు పెయ్యదూడల పథకంపై అవగాహన కలిగి, ఉపయోగించుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కే బేబీరాణి కోరారు. ఒంగోలు డీఎల్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఆర్‌హెచ్‌టీసీ, పశుసంవర్థక శాఖ సంయుక్త సహకారంతో పాడి రైతులకు కార్యశాల (విజ్ఞాన శిక్షణ) నిర్వహించారు. డీఎల్‌డీఏ చైర్మన్ కోసూరి రాధ మాట్లాడుతూ జాతి అభివృద్ధి కోసం కృత్రిమ గర్భధారణ పథకం పశువుల్లో చాలా ఉపయోగపడుతుందని అన్నారు. డీఎల్‌డీఏ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ కాలేషా, ఒంగోలు ఉపసంచాలకులు డాక్టర్ ఏ.రమేష్‌బాబు, నాగులుప్పలపాడు సహాయ సంచాలకులు డాక్టర్ నాగభూషణం, డీఎల్‌డీఏ పశువైద్యులు డాక్టర్ డి.కృష్ణారావు, గుంటూరు ఆర్‌హెచ్‌టీసీ పశువైద్యులు డాక్టర్ శ్రీనివాస రెడ్డి పాల్గొని పశుపోషకులను పలు సూచనలు చేశారు.

ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తృతం చేయాలి

- రోజుకు టార్గెట్ రూ.6 లక్షలను రూ.12 లక్షలకు పెంచాలి
- ఆర్టీసీ ఈడీ షేక్ ఆదం సాహెబ్



కార్గో డెలివరీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఈడీ

ఒంగోలు: ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తృతం చేయాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ ఆదం సాహెబ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ కార్గో డెలివరీ పాయింట్ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సూపర్‌వైజర్లు, కార్గోలో పనిచేసే ఆపరేటర్లు, హమాలీలతో సమీక్షించారు. ప్రస్తుతం రూ.20 లక్షలతో భవనాన్ని నిర్మించుకున్నామని, వ్యాపారాన్ని మరింత పెంచితే మరో రెండేళ్లలో మరో భవనం నిర్మిస్తామన్నారు. కార్గో వ్యాపారం రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్లు చేయాలని ఆర్టీసీ నిర్ణయించిందని, ఇప్పటి వరకు రూ.300 కోట్లు పూర్తయిందని, మరో ఆరు నెలల్లో మిగిలిన రూ.200కోట్లు పూర్తిచేయాలంటే అందుకు ప్రతి డిపోలోని ఆర్టీసీ కార్గోతో పాటు ఆర్టీసీ ఆథరైజ్డ్ కార్గో ఏజెంట్ల సహకారం కూడా అవసరం అని చెప్పారు. ప్రకాశం జిల్లాలో రూ.1.56 కోట్లతో సివిల్ వర్కులు ప్రారంభిస్తున్నామని, సింగరాయకొండ ఆర్టీసీ డిపోలో ప్లాట్‌ఫారాలు ఎత్తులేపడంతోపాటు పలు డిపోల్లో మరికొన్ని సివిల్ వర్కులు చేపడతామని తెలిపారు. ప్రస్తుతం రోజుకు రూ.6 లక్షలు జిల్లావ్యాప్తంగా కార్గో ఆదాయం ఉందని, దానిని రూ.12 లక్షలకు పెంచాలని కార్గో అధికారులను ఆదేశించారు. గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమ నిర్వాహకుడు మస్తాన్ మాట్లాడుతూ కార్గో సేవలు అందుబాటులోకి రావడం ద్వారా డెలివరీ సమస్యలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ జిల్లా అధికారి బి.సుధాకరరావు, ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్టీసీ కార్గో ఏటీయం నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శక్తిరూపిణీ పాహిమాం...



కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవి అలంకరణలో ఒంగోలు లాయరుపేటలోని సాయిబాబా ఆలయంలో ఉన్న రాజరాజేశ్వరీ దేవి



శాకంబరి అలంకారంలో ఒంగోలు గంటాయిపాలెంలోని పార్వతీదేవి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. శక్తిరూపిణి అయిన ఆ ఆదిపరాశక్తిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మహాలక్ష్మిగా, కూష్మాండదుర్గగా, శాకంబరిగా, అన్నపూర్ణగా ఇలా వివిధ రూపాలలో అమ్మవారు పూజలందుకుంటోంది. ప్రముఖ పుణ్యక్షేత్రం త్రిపురాంతకంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.



కూష్మాండదుర్గ అలంకారంలో త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి



వల్లూరులో మహాలక్ష్మి అలంకారంలో వల్లూరమ్మ తల్లి

జీవనోపాధికి చేదోడు



జగనన్న చేదోడు నగదును చూపుతున్న టైలరింగ్ చేస్తున్న మహిళలు (ఫైల్)

- నేడు జగనన్న చేదోడు నాలుగో విడత నిధులు విడుదల
- జిల్లాలో 14535 మందికి రూ.14.53 కోట్ల లబ్ధి
- రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం

ఒంగోలు: జగనన్న చేదోడు నాలుగో విడత నిధులు గురువారం ఉదయం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు రూ.10 వేల చొప్పున ఈ ఆర్థిక సాయం అందనుంది. చిన్న చిన్న చేతి వృత్తులు చేసుకుంటూ జీవనం సాగించే వారు ఆర్థికంగా బలోపేతమై సుస్థిర జీవనోపాధి పొందేందుకు ఈ నిధులు విడుదల చేస్తున్నారు. ఇప్పటికి మూడు విడుతల నిధులు విడుదల చేయగా, తాజాగా నాలుగో విడత నిధులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విడుదల చేయనున్నారు. జిల్లాలో ఈ ఏడాది 14535 మంది లబ్ధిదారులుగా నిర్ణయించారు. వీరికి రూ.14.53 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి.

ఈ ఏడాది అర్హులు 14535 మంది:

తొలి దఫా, రెండో దఫాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా 56 మండలాల్లో లబ్ధిదారుల ఎంపిక జరిగింది. 2020–21 తొలి దఫాలో 19969 మందికి రూ.19.96 కోట్లు, రెండో దఫా 2021–22లో 18475 మంది రూ.18.47 కోట్లు అందించారు. గత ఏడాది విభజన ప్రకాశం జిల్లా ప్రకారం జిల్లాలోని 38 మండలాల పరిధిలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. 2022–23లో 14527 మందికి రూ.14.52 కోట్లు అందించారు. తాజాగా నాలుగో విడత 2023–24లో 14535 మందిని అర్హులుగా గుర్తించి లబ్ధిదారులుగా నిర్ణయించారు. వీరికి గురువారం సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కిన అనంతరం వారి బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున రూ.14.53 కోట్లు జమకానున్నాయి. లబ్ధిదారులుగా నిర్ణయించిన టైలర్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలు ఉన్నారు.



జిల్లా వ్యాప్తంగా విడుదలైన నిధుల వివరాలు

సంవత్సరం	రజకులు	నాయీ బ్రాహ్మణులు	టైలర్లు
2020–21	2824	1858	8301
2021–22	2653	1565	8249
2022–23	2949	1771	9807
2023–24	2643	1608	10284

ఈ ఏడాది నియోజకవర్గాల వారీగా విడుదల కానున్న నిధులు

నియోజకవర్గం	రజకులు	నాయీ బ్రాహ్మణులు	టైలర్లు	మొత్తం (కోట్లు)
దర్శి	219	240	1281	1.74
గిద్దలూరు	500	285	1113	1.89
కనిగిరి	373	200	2060	2.63
కొండపి	240	163	941	1.34
మార్కాపురం	338	167	1128	1.63
ఒంగోలు	437	186	1533	2.15
సంతనూతలపాడు	226	163	870	1.25
యర్రగొండపాలెం	310	204	1358	1.87
మొత్తం	2643	1608	10284	14.53



నకిలీల భరతం పట్టాలి

- డాక్యుమెంట్ల సృష్టికర్తలను గుర్తించాలి
- మూలాలను గుర్తించి దర్యాప్తు వేగవంతం చేయాలి
- సిట్ అధికారులను ఆదేశించిన ఎస్పీ మలికాగర్గ్



సిట్ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ మలికాగర్గ్, ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్వీ.శ్రీధర్ రావు

ఒంగోలు సబర్బన్: నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల సృష్టికర్తలను సత్వరం గుర్తించాలని ఎస్పీ మలికాగర్గ్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులను ఆదేశించారు. ఎస్పీ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా అదనపు ఎస్పీ (ఏఎస్పీ–క్రైమ్స్) ఎస్వీ.శ్రీధర్‌రావుతో కలిసి సిట్ అధికారుల బృందంతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు నమోదైన కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కేసులో అసలు మూలాలను గుర్తించాలని ఆదేశించారు. ఆ వైపుగా దర్యాప్తు సాగితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. ఇప్పటి వరకు నమోదైన 12 కేసులకు సంబంధించి పూర్తి స్థాయి వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. అలాగే అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కేసుల్లో పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు పోతూ దర్యాప్తు చేపట్టాలని కూడా ఆదేశించారు. పేర్లు రాయకుండా ఖాళీ స్టాంపులు అమ్మిన స్టాంపు వెండర్లను, పాత స్టాంపులు విక్రయించిన వారిని సైతం గుర్తించాలన్నారు. స్థలాలు, వ్యవసాయ భూములపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, డీకే పట్టాలు, డెత్, బర్త్‌తో పాటు ఇతర పత్రాలకు సంబంధించిన వివరాలను ఆయా కార్యాలయాల్లో పరిశీలించాలన్నారు. సర్టిఫికెట్లకు సంబంధించిన వాస్తవ యజమానులను గుర్తించాలన్నారు. స్థలాలపై ముందుగా ఎవరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారన్న కీలకమైన సమాచారాన్ని రాబట్టాలన్నారు. ఖాళీ స్టాంపు పేపర్లు ఎంతమందికి అమ్మారో, వారికి ఉన్న లింకులను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మరీ తేల్చాలని కూడా నిర్దేశించారు. పూర్తి స్థాయి సాక్ష్యాధారాలతో వాళ్లను పట్టుకోవాలని కూడా ఆదేశించారు. అలాంటి వారిని అరెస్ట్ చేసి వారికి శిక్షలు పడేలా కేసులను అన్ని ఆధారాలు సేకరించాలన్నారు. అంతిమంగా బాధితులకు న్యాయం జరగాలన్నారు. సమీక్షలో ఏఎస్పీ క్రైమ్స్ ఎస్వీ.శ్రీధర్ రావు, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర బాబు, సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి, దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్, కనిగిరి డీఎస్పీ రామరాజు, సిట్ టీం సీఐలు, చీమకుర్తి డిప్యూటీ తహశీల్దార్ సాయి శ్రీనివాస్, ఎన్‌జీపాడు ఆర్ఐ ప్రమోద్ ఉన్నారు.

కౌశల్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

- డీఈవో వీఎస్ సుబ్బారావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వీఎస్ సుబ్బారావు

ఒంగోలు: భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ శాస్త్ర సాంకేతికమండలి, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కౌశల్ పరీక్షకు అర్హులైన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో బుధవారం కౌశల్ 2023 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌశల్ సైన్స్ క్విజ్ పోటీకి 8, 9, 10 తరగతుల విద్యార్థులు జట్టుగా ఏర్పడాలన్నారు. ఇది కేవలం ప్రభుత్వ రంగ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ పరీక్ష రాసి సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను చైతన్యపరచాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ టి.రమేష్, సెల్ నెంబర్ 9666955504 ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంవో శివకుమార్, సైన్స్ ఉపాధ్యాయులు తిరుపతయ్య, నివేదిత, రమణయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పసిప్రాణాలు నిలిపిన ఆరోగ్యశ్రీ

- ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జననం
- రూ.25 లక్షల ఖర్చయ్యే చికిత్సను ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేసిన అమ్మ హాస్పిటల్ వైద్యులు

ఒంగోలు టౌన్: ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు పుట్టారు. తక్కువ బరువుతో పుట్టిన ఆ పిల్లలకు ఖరీదైన చికిత్స అవసరమైంది. అంత స్థోమత ఆ నిరుపేద దంపతులకు ఆరోగ్యశ్రీ పథకం అండగా నిలిచింది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సుమారు రూ.25 లక్షల ఖర్చయ్యే చికిత్స అంది పిల్లలు హుషారుగా ఉండటంతో ఆ దంపతుల మోముపై చిరునవ్వులను నిలిపింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన మార్తాల శ్రీనివాసరెడ్డికి 2012లో వెంకటలక్ష్మితో వివాహమైంది. ఆ దంపతులకు చాలా కాలం సంతానం కలగలేదు. చివరికి వెంకటలక్ష్మి గర్భం దాల్చింది. వైద్య పరీక్షలు చేసిన వైద్యురాలు వెంటలక్ష్మి కడుపులో ముగ్గురు పిల్లలు ఉన్నారని, రిస్క్ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పన్నెండేళ్ల తరువాత వచ్చిన గర్భం కనుక ఏదైతే అదవుతుందని గర్భం ఉంచుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 17న ఆ దంపతులకు పండంటి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఇద్దరు ఆడపిల్లలు, ఇక అబ్బాయి ఉన్నారు. అయితే 30 వారాల లోపు పుట్టడంతో పిల్లలు తక్కువ బరువుతో పుట్టారు. వీరిలో ఒక పాప బరువు 1.280 కేజీలు ఉండగా మరో పాప బరువు 1.150, అబ్బాయి 1.125 కేజీల బరువు ఉన్నారు. ఈ పిల్లలను నియోనేటల్ వెంటిలేటర్ ద్వారా చికిత్స అందించాల్సి ఉంటుందని కాన్పు చేసిన వైద్యురాలు చెప్పారు. కనీసం ఒక్కొక్కరికి రూ.7 లక్షలకు పైగా ఖర్చవుతుందన్నారు. తోపుడు బండి మీద వీధులు తిరుగుతూ ఫ్యాన్సీ వస్తువులు విక్రయించి బతికే శ్రీనివాసరెడ్డికి అంత ఖరీదైన వైద్యం చేయించే స్థోమత లేకపోవడంతో ఆ దంపతులకు ఏం చేయాలో దిక్కుతోచక దిగులు పడ్డారు. దీంతో సదరు వైద్యురాలు వారిని ఒంగోలులోని లంబాడీడొంకలో ఉన్న అమ్మ పిల్లల వైద్యశాలకు రిఫర్ చేశారు. వెంటనే అక్కడికి తరలించి ఆరోగ్య శ్రీలో చికిత్స ప్రారంభించారు. నియోనేటాలజి వైద్యులు డాక్టర్ కోటపాటి నర్సింహ, పీడియాట్రిస్ట్ వై.ఆశ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్యం చేశారు. నెలరోజుల తరువాత బుధవారం ఆ ముగ్గురు పిల్లల బరువు సరాసరిన 1.700 కేజీలకు పెరిగారు. ఆరోగ్యం కూడా హుషారుగా ఉండడంతో వారిని డిశ్చార్జి చేశారు. ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు పుట్టడం అరుదని, అమ్మ పిల్లల వైద్యశాల నియోనేటాలజిస్ట్ డా.కె.నర్సింహ తెలిపారు. తక్కువ బరువు కలిగిన ఈ పిల్లలను ఆరోగ్య శ్రీ ద్వారా పూర్తిగా వారికి ఉచితంగా చికిత్స చేశారని, ఆరోగ్యశ్రీలో ఇలాంటి పిల్లలకు చికిత్స చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చిన్నారులకు వైద్యం చేసిన వైద్యులను ఆరోగ్యశ్రీ స్పెషలాఫీసర్ యాదాల అశోక్‌బాబు అభినందించారు. పిల్లలకు చికిత్స చేసిన డాక్టర్ వై ఆశ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద వెయ్యి మంది ప్రీ మెచ్యూర్ పిల్లలకు చికిత్స చేసినట్లు తెలిపారు.



చిన్నారులకు ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేసి వైద్యులతో ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ బాబు

మా పాలిట దైవం జగనన్న:

ఆరోగ్య శ్రీ వల్లనే ఈ రోజు మా పిల్లలను హుషారుగా చూసుకునే అదృష్టం కలిగింది. ఏ రోజుకారోజు తెచ్చుకొని తిని బతికే మేము ఒకేసారి రూ.25 లక్షలు ఖర్చు పెట్టి చికిత్స చేయించడమేది కలలో కూడా సాధ్యమయ్యేది కాదు. జగనన్న మా పాలిట దైవంగా నిలిచారు. – వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు

మళ్లీ విజయఢంకా మోగిద్దాం

- నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ ఎస్సీ ముఖ్యనాయకుల ప్రాంతీయ సదస్సులో మంత్రి మేరుగు నాగార్జున
- సామాజిక న్యాయ బస్సుయాత్రపై సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున. చిత్రంలో ఎస్సీ సెల్ నాయకులు

నెల్లూరు (దర్గామిట్ట): పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, దళితులకు పెద్దపీట వేసి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి దళితులందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. నగరంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ కళ్యాణ మండపంలో బుధవారం తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ముఖ్య నాయకులతో సామాజిక బస్సు యాత్ర విజయవంతంపై సన్నాహక సమావేశం జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పందింటి కామరాజు అధ్యక్షతన నిర్వహించారు.

చీకటి దొంగ ముసుగులో ప్రతిపక్షాలు:

చీకటి ముసుగులో ప్రతిపక్షాలు ఉన్నాయని, వెలుతురుతో ప్రజల పక్షాన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉన్నాడని, మనందరం ఒక్కతాటిపై నిలచి మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జూపూడి ప్రభాకర్ అన్నారు. కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ, స్టేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బండితోక అరుణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పందింటి కామరాజు ఎమ్మెల్సీల మేరిగ మురళీధర్, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ప్రాంతీయ అధ్యక్షుడు దేవదానం, నల్లారి బాబు, దేవప్రసాద్ పాల్గొన్నారు.

భూదందాలకు కేరాఫ్ టీడీపీ

- లిడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్



కాకుమాను రాజశేఖర్

ఒంగోలు: భూదందాలకు కేరాఫ్ తెలుగుదేశం పార్టీ అని, రాష్ట్రంలో ఎవరిని అడిగినా ఈ విషయం చెబుతారని లిడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలులో వెలుగు చూసిన నకిలీ స్టాంపుల కుంభకోణంలో దర్యాప్తు వేగవంతం కావాలని బాలినేని సూచించడంతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టిందన్నారు. బాలినేని ఎవరినైనా కాపాడాలని అనుకుని ఉంటే ఆయన ఎందుకు సిట్ వేయమని కోరతారని, కేవలం రాజకీయ కక్షతో ఆయన్ను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ప్రజల్లో లబ్ధి పొందాలనే ప్రతిపక్షాల కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దశాబ్దాల రాజకీయ జీవితం కలిగి ఉండి పేదలకు అండగా ఉంటూ తన స్థిరాస్తులను సైతం అమ్ముకుంటూ పేదలకు అండగా ఉన్న ఏకైక వ్యక్తి బాలినేని అన్నారు. అటువంటి బాలినేనిపై, ఆయన కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారన్నారు. దామచర్ల జనార్దన్‌రావు..ఆయన అనుచరు ద్వారా ఇటువంటి చవకబారు విమర్శలు చేయడం మానుకోవాలని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామన్నారు. బురద జల్లడం మానుకుని ఆధారాలంటే ధైర్యంగా బాధితుల చేత సిట్ వద్ద ఫిర్యాదు చేయించాలని బాలినేని విసిరిన సవాల్‌ను స్వీకరించాలన్నారు. గత ఐదు సంవత్సరాల్లో టీడీపీ చేసిన అభివృద్ధి, ప్రస్తుత పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు వస్తామంటే సంసిద్ధమని సవాల్ విసిరారు. ఒంగోలు నగర పాలక సంస్థకు రూ.166 కోట్లు, విద్యుత్‌శాఖ ద్వారా రూ.169 కోట్లు, ఆరోగ్యానికి రూ.211 కోట్లు, గృహ నిర్మాణశాఖ రూ.81 కోట్లు, నాడు–నేడు పాఠశాలల ఆధునికీకరణకు రూ.16.50 కోట్లు, పోతురాజు కాలువకు రూ.89 కోట్లు, వ్యవసాయానికి రూ.34 కోట్లు, పంచాయతీరాజ్ రూ.14.50 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.50.50 కోట్లు వెరసి రూ.998 కోట్లు బాలినేని నిధులు తెప్పించారన్నారు. వీటిలో ఇంకా రిమ్స్ ఆధునికీకరణ, కరోనా సమయంలో చేసిన వ్యయం అధికం అన్నారు. గతంలో మెడికల్ కాలేజీ వచ్చినా, ఒంగోలు తాగునీటి ఎద్దడి నివారణకు రూ.339 కోట్లతో అమృత్ పథకం కింద నిధులు మంజూరైనా అదంతా బాలినేని చిత్తశుద్ధిలో భాగమే అన్నారు. టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చేస్తున్న యత్నాలను జనం ఛీకొడుతున్నారన్నారు.

క్లుప్తంగా

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం: ఒక వైపు అప్పులు, మరో వైపు అనారోగ్య కారణాలతో మానసిక వేదనకు గురై ఓ వ్యక్తి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పట్టణంలోని 10వ వార్డులో రామలక్ష్మణ వీధిలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. రామలక్ష్మణ వీధిలో నివాసం ఉంటున్న కోట రామసుబ్బారావు(55) ఒక వస్త్రదుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. కుటుంబం కోసం చేసిన అప్పులు ఎక్కువ కావడం, అనారోగ్యంతో ఆందోళన చెందుతూ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండపి ఎస్సై బదిలీ

కొండపి(సింగరాయకొండ): కొండపి మండల ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న వైవీ రమణయ్యను తాళ్లూరు మండలానికి బదిలీ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం స్టేషన్ బాధ్యతలను సీఐ పాండురంగారావు చూస్తున్నారు. కాగా, ఎస్సై రమణయ్య బదిలీలో ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని పోలీసు వర్గాలు చెప్పాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

కంభం: మండలంలోని సూరేపల్లె గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతుడు రైలు నుంచి జారీ పడ్డాడా లేక ఎవరైన హత్య చేసి ఇక్కడ పడేశారా అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి శరీరంపై టీషర్టు, జీన్స్ ప్యాంట్ ఉన్నాయి. మృతి చెంది మూడు రోజులు కావడంతో శరీరంలో నుంచి పురుగులు పట్టి దుర్వాసన వస్తోంది.

రూ.36 లక్షల బియ్యం సీజ్



మిల్లులో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ

బేస్తవారిపేట: మండలంలోని చెట్టిచర్ల సమీపంలోని ఓ రైస్‌మిల్లులో రూ.36 లక్షల విలువైన బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయభాస్కర్ సీజ్ చేశారు. రైస్‌మిల్లులో బీ రిజిస్టర్, కొనుగోలు, అమ్మకపు బిల్లులు లేక పోవడంతో 6ఏ కేసు నమోదు చేశారు. 1012.75 క్వింటాళ్ల బియ్యం బస్తాలు, 67.50 క్వింటాళ్ల ముడి బియ్యాన్ని సీజ్ చేసినట్లు డీఎస్‌ఓ చెప్పారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్‌కుమార్, ప్రసాద్, చంద్రశేఖర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గంగిరెడ్డి ఉన్నారు.

ఖైదీల్లో పరివర్తన ప్రధానం

- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా
- ఒంగోలులోని జిల్లా జైలు సందర్శన
- మౌలిక వసతులు, అంతర్గత భద్రతపై ఆరా



ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా, పక్కన ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్: జైల్లో ఉన్న ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని రాష్ట్ర ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్(డీజీ) హరీష్ కుమార్ గుప్తా జిల్లా జైలు అధికారులను ఆదేశించారు. బుధవారం ఒంగోలులోని జిల్లా జైలును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జైళ్ల శాఖ డీజీ మాట్లాడుతూ.. ఖైదీలు శిక్ష అనుభవించారు, వెళ్లారు అన్నట్లుగా ఉండకూడదని చెప్పారు. నేరాలు చేసి జైలుకు వచ్చిన వారు బయటకు వెళ్లిన తర్వాత తీరు మార్చుకోకపోతే ప్రతిఫలం ఏముంటుందో ఆలోచించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తొలుత డీజీ జైలు ప్రాంగణంలో కలియతిరిగారు. బ్యారక్‌లను నిశితంగా పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. జైలులో వైద్య సేవలు, ఉచిత న్యాయ సాయంపై ఆరా తీశారు. జైలులో మౌలిక వసతులు, అంతర్గత భద్రతలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని జైలు అధికారులను ప్రశ్నించారు. ఖైదీల కదలికలు, వారి ప్రవర్తనపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జైలు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జైల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సూపరింటెండెంట్ వరుణారెడ్డి, జిల్లా జైళ్ల అధికారి వెంకటరెడ్డితో చర్చించారు. జైలులోని వైద్యశాల, మహిళా ఖైదీల బ్లాక్‌లకు మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు డీజీ దృష్టికి తీసుకెళ్లారు. డీజీ వెంట జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ అధికారి డాక్టర్ ఎం.వరప్రసాద్, ఎస్పీ మలికా గర్గ్, ఎస్పీ డీఎస్పీ బి.మరియదాస్, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్, కారాగార వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, జైలర్ వి.రమేష్, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యం.. ఆరోగ్యాంధ్ర

- ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి యాదాల అశోక్‌బాబు



డాక్టర్ యాదాల అశోక్‌బాబుతో కలిసి పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరంలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపులో జరుగుతున్న వైద్యం తీరును పరిశీలించారు. నగరంలోని 45వ డివిజన్‌లో కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో, 10వ డివిజన్ కొప్పోలులో కార్పొరేటర్ బెంగళూరు నర్సయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ బాబు మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలతోపాటు మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సురక్ష వైద్య శిబిరాలను గ్రామాలతోపాటు పట్టణాల్లోని వార్డులు, డివిజన్లలోనూ నిర్వహించేలా కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు శ్రీరాం నాగభూషణం, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించే దమ్ముందా?

- లేదంటే రాజకీయ సన్యాసం చేస్తారా
- అఖిల పక్ష కమిటీని మీడియాతో కలుపుకొని వేద్దామా
- టీడీపీ నేతలకు ఒంగోలు డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవ సవాల్
- స్థాయి మరిచి బాలినేనిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరిక



ఒంగోలు సబర్బన్: విషయ పరిజ్ఞానం లేకుండా.. వాస్తవాలను వక్రీకరిస్తూ నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునేది లేదని టీడీపీ నాయకులను ఒంగోలు నగర డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని, లేదంటే రాజకీయ సన్యాసం చేస్తారా అని సవాల్ విసిరారు. స్థానిక రాజీవ్ నగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలపై ధ్వజమెత్తారు. అసలు స్థలాలేంటో, పొలాలేంటో తెలియకుండా టీడీపీ నేత ఎద్దు శశికాంత్ భూషణ్ నోటికొచ్చినట్లు వాగితే ఊరుకోబోమని హెచ్చరించారు. 1966లో 39 సెంట్ల స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులు.. 1972లో మరొకరు కొనుగోలు చేసిన 72 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే ఎవరు ఊరుకుంటారని ప్రశ్నించారు. అసలు ఆ స్థలాల విషయంలో ఏమి జరిగిందో ముందుగా తెలుసుకోవాలని హితవుపలికారు. మన్నేపల్లి కోటేశ్వరరావు మూడు ప్రాంతాల్లో 3 ప్లాట్లు కొనుగోలు చేశారని, వాటిపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఆ కేసుతో తనకు సంబంధం ఏంటని, అసలు నకిలీ డాక్యుమెంట్ల కేసుకు ఏవేవో ముడిపెట్టి మాట్లాడటమేంటని నిలదీశారు. ఈ ఆరోపణలపై మీడియా ప్రతినిధులతో కలిసి అఖిలపక్ష కమిటీ వేసేందుకు సిద్ధంగా ఉన్నానని, తాను భూకబ్జా చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు.

కుండల వ్యాపారం చేసుకునే పట్లూరి కోటేశ్వరరావు వద్ద స్థలాల పేరుతో రూ.51 లక్షలు తీసుకుని నిలువునా మోసం చేసిన ఎద్దు శశికాంత్ భూషణ్ తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై స్థాయి మరిచి విమర్శించడాన్ని ఆక్షేపించారు. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల కుంభకోణానికి సంబంధించి బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సాక్షాత్తు ఎస్పీ మలికా గర్గ్ ఒక పక్క చెబుతుంటే.. ఆధారాలు ఇవ్వకుండా రాజకీయ పబ్బం గడుపుకోవటానికి అవాకులు, చెవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. ఎద్దు శశికాంత్ భూషణ్‌పై కోర్టులో పరువు నష్టం దావా వేస్తున్నానని వెలనాటి చెప్పారు. సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అజీజ్, నత్తల యానాదిరావు, దుగ్గిరాల శేఖర్, గరటయ్య, శ్రీనివాసరావు, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని మహిళ దుర్మరణం



మృతురాలి బంధువులను విచారిస్తున్న ఎస్సై అంకమ్మరావు

చీమకుర్తి: స్కూటీని వెనుకే వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. రోడ్డుపై పడిపోయిన ఆమె మీదుగా టిప్పర్ టైర్లు ఎక్కడంతో శరీరం ఛిద్రమై మాంసపు ముద్దలా మారింది. దీంతో సంఘటనా స్థలం భీతావహంగా మారింది. ఈ ప్రమాదం సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరు డొంక సమీపంలో ట్రిపుల్ ఐటీ కాలేజీ(ఎస్ఎస్ఎన్ క్యాంపస్) సమీపంలో కర్నూలు రోడ్డుపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సంతనూతలపాడు మండలం

ఎనికపాడు గ్రామానికి చెందిన మద్దిరాల చినజాలమ్మ(56) తన కోడలు శాంతితో కలిసి స్కూటీపై ఒంగోలు బయలుదేరింది. ఈ క్రమంలో చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు గ్రానైట్ డస్ట్ తీసుకెళ్తున్న టిప్పర్.. ఎండ్లూరు డొంక సమీపంలో స్కూటీ వెనుక కూర్చున్న చినజాలమ్మ కాలును తగిలింది. పట్టుతప్పి టిప్పర్ కింద పడటంతో జాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మీదుగా టిప్పర్ ఎక్కడంతో శరీరం నుజ్జునుజ్జయింది. ఈ పరిణామాన్ని చూసిన వాహనదారులు భీతిల్లిపోయారు. ప్రమాదం కారణంగా ఇరువైపులా కిలో మీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. స్కూటీ నడుపుతున్న శాంతి అదృష్టవశాత్తు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మృతురాలి బంధువులు బోరున విలపించారు. ఒంగోలులోని ఓ ఆస్పత్రిలో బంధువులను పరామర్శించేందుకు అత్తా కోడళ్లు స్కూటీపై వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. సంతనూతలపాడు ఎస్సై ఆంజనేయులుతో పాటు ఒంగోలు తాలూకా ఎస్సై అంకమ్మరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కోడలు శాంతి ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా ఎస్సై అంకమ్మరావు కేసు నమోదు చేశారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యత

- కలెక్టర్ దినేష్ కుమార్



వల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

టంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని వల్లూరు సచివాలయ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ దినేష్ కుమార్, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఏ ఏ పరీక్షలు, మందులు ఇస్తున్నారో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తోందని చెప్పారు. ఆరోగ్య సురక్ష ద్వారా వేల మందికి ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రజల అవసరాలకు తగినట్లుగా స్థానికంగానే సచివాలయ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన వారికి జీజీహెచ్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఉన్న ఆస్పత్రులకు పంపుతామన్నారు. ఎక్కువ శాతం బీపీ, షుగర్ రోగులు వస్తున్నారని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ మల్లీశ్వరి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన చిన్నారుల పౌష్టికాహార శిబిరాన్ని, పలు రకాల శిశువులకు అంగన్‌వాడీ సెంటర్లలో అందించే పౌష్టికాహార శాంపిల్స్‌ను పరిశీలించి, గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. వైద్యులు 306 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 8 మందికి మెరుగైన వైద్య సేవలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీఓ వనజాక్షి, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, నాయకులు కుందం హనుమారెడ్డి, సర్పంచి వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవాణి, సనగర కోటి, వైద్యులు ప్రసాద్‌బాబు, బాలాజీ అశోక్, సీహెచ్‌వో మాతయ్య, కార్యదర్శి స్వర్ణకుమార్ పాల్గొన్నారు.

అయితా రామయ్య శ్రేష్ఠి సత్రం వంశపారంపర్య ధర్మకర్తల ప్రమాణం నేడు

సింగరాయకొండ: పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 19వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు అయితా రామయ్య శ్రేష్ఠి సత్రం వంశపారంపర్య ధర్మకర్తలుగా వారి వారసులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. అయితా రామయ్యశ్రేష్ఠి వారసులుగా గుర్తించి సత్రం స్థలం బాధ్యతలు అప్పగించాలని కోరుతూ కొన్నేళ్ల క్రితం అయితా వెంకటసుబ్బయ్య, పిచ్చయ్య, పురుషోత్తం ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. వీరిని వారసులుగా గుర్తిస్తూ గత ఏడాది ఆగస్టులో ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఆ ముగ్గురితో ప్రమాణస్వీకారం చేయించాలని కందుకూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణను ఒంగోలు దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసరావు ఆదేశించారు. నూతన ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో సత్రం అభివృద్ధికి కృషి చేస్తామని ఈఓ పేర్కొన్నారు.

మంటలంటుకుని చిన్నారికి తీవ్ర గాయాలు

కనిగిరి రూరల్: ఏడేళ్ల చిన్నారి దుస్తులకు మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కనిగిరిలో చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక కాశిరెడ్డి కాలనీకి చెందిన నంబూరి రాము, భార్యాపిల్లలతో కలిసి రిక్షాపై చిత్తు కాగితాలు ఏరుకుంటూ.. వెంకటేశ్వర స్వామి గుడి వెనుక ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ చిత్తు కాగితాలు తగలబెడుతుండగా.. నిప్పును ఎగేసే క్రమంలో రాము ఏడేళ్ల కుమార్తె శోభ గౌనుకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. కాలిన గాయాలకు తాళలేక ఆ చిన్నారి విలవిల్లాడిపోయింది. స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

చరిత్ర పుటల్లో

రాజగోపురాల నిర్మాణం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భూదేవి శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ రాజగోపురాలు, రంగనాయక, ఆండాళమ్మ, ఆంజనేయ స్వామి ఉపాలయాల నిర్మాణం చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. రాబోయే తరాల వారికి స్వామివారి ఆలయం ఆధ్యాత్మిక వారసత్వ సంపదగా నిలిచేలా నిర్మాణాలు సాగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. బుధవారం ఆలయంలో తూర్పు పడమర రాజగోపురాల ప్రాకారాల శ్లాబు నిర్మాణానికి పాలక మండలి సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పూజలు చేశారు. ప్రభుత్వం నుంచి సీజేఎఫ్ నిధులు, దాతల సహకారంతో సుమారు 11 కోట్ల రుపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పాలక మండలి చైర్మన్ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి వివరించగా.. నాణ్యతలో రాజీ పడవద్దని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పాలక మండలి సభ్యుడు అర్జునరావు, శ్రీశైల దేవస్థానం బోర్డు మెంబర్ డాక్టర్ కనకదుర్గ, పార్టీ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, రామడుగు బాలసుబ్బారావు, సూరె శివప్రసాద్, పీవీ కృష్ణారావు, ఉటుకూరి రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ, కేశవరావు, బాలమురళీకృష్ణ

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్లు ఆవిష్కరించిన శిద్దా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శిద్దా రాఘవరావు, తదితరులు

ఒంగోలు: అంతర్‌జిల్లాల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్లను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ఆయన నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిద్దా మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఒంగోలులో పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడాకారులకు ఎటువంటి లోటు లేకుండా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు రిటైర్డ్ ఎస్పీ డాక్టర్ రాజశిఖామణి, కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివశంకరరావు, అద్దంకి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర సెక్రటరీగా మోజీ

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర సెక్రటరీగా వేముల మోజీ నియమితులయ్యారు. పార్టీ జిల్లా మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రామునాయుడు, తదితరులు మోజీకి అభినందనలు తెలిపారు.

దీపావళి దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు అర్బన్: దీపావళికి బాణసంచా విక్రయించేందుకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు, అవసరమైన అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత తెలిపారు. ప్రకాశం భవనంలో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విపత్తుల శాఖలతో బుధవారం సమావేశం నిర్వహించి నిర్ణయాలుతీసుకున్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు తాత్కాలిక క్రాకర్స్ లైసెన్స్ కోసం ఈ నెల 19 నుంచి 28వ తేదీలోపు మీసేవా కేంద్రాలు, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు చిరునామా, ఆధార్, పాస్‌పోర్ట్ ఫొటోలు, జనన ధ్రువీకరణ, అఫిడవిట్, వాణిజ్య, పోలీసు, అగ్నిమాపక, స్థానిక సంస్థల శాఖల ధ్రువీకరణ పత్రాలు జతపరచాలని తెలిపారు. లైసెన్స్‌లు పొందిన వారు తగిన నిబంధనలతో నిర్దేశించిన ప్రాంతాల్లో వచ్చే నెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజులు మాత్రమే బాణసంచా అమ్మకాలు జరపాలని, 12వ తేదీ సాయంత్రం 7 గంటల్లోపు స్టాల్స్ ఖాళీ చేయాలని తెలిపారు.

గడ్డివామి దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న స్థానికులు

కురిచేడు: స్థానిక ఎస్సీకాలనీకి చెందిన ఎనుముల లక్ష్మయ్య వరిగడ్డి వామి బుధవారం దగ్ధమై సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది. పిల్లలు దీపావళి టపాసులు కాల్చడంతో వాటి రవ్వలు గడ్డివామిపై పడి మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే మంటలను అదుపు చేశారు. వామి పాక్షికంగా కాలిపోయినా వామిలోని గడ్డి వాసన వస్తూ పశువులు తినేందుకు అవకాశం లేకుండా పోయిందని, ఈ ఏడాది గడ్డి కొనుగోలు చేయాలన్నా ఎక్కడా లభించటం లేదని లక్ష్మయ్య వాపోయాడు. పశువుల కోసం అప్పుచేసి మరీ తెచ్చిపెట్టుకున్న గడ్డివామి అగ్నికి ఆహుతి కావడంతో ఆవేదన వ్యక్తం చేశాడు.

బిందుసేద్య పరికరాలపై అవగాహన అవసరం



బిందుసేద్య పరికరాలపై అవగాహన కల్పిస్తున్న సంధ్య

కురిచేడు: మండలంలోని కల్లూరు గ్రామంలో రైతులకు బిందుసేద్య పరికరాలపై బుధవారం ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవనశాఖ పొదిలి అధికారి డి.సంధ్య పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 90 శాతం రాయితీతో చిన్న, సన్నకారు రైతులకు అందిస్తున్న బిందుసేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఏఓ కే వెంకటేశ్వర్లు, కుమార్ కంపెనీ ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్‌బీకే కన్వీనర్ ఎస్.బుజ్జి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

- లింగంగుంటలో 440 మందికి వైద్య పరీక్షలు
- వైద్య శిబిరాన్ని పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్



లింగంగుంటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, అధికారులు

మద్దిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం మద్దిపాడు మండలంలోని లింగంగుంట గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 440 మందికి వైద్య పరీక్షలు చేశారు. హృద్రోగ నిపుణులు, కంటి పరీక్షల నిపుణులు చిన్నపిల్లల వ్యాధి నిపుణులు శిబిరంలో పాల్గొనడంతో బాధిత ప్రజలు భారీగా హాజరై వినియోగించుకుంటున్నారు. స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ లింగంగుంటలో మెడికల్ క్యాంప్‌ను సందర్శించారు. ప్రతి స్టాల్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు. ఆయన వెంట సర్పంచ్ తూమాటి కల్యాణి జనార్దనరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజని, బత్తుల శ్రీనివాసరావు, శ్రీకాంత్, డాక్టర్లు, వైద్య శాఖ సిబ్బంది, హెల్త్ క్లినిక్‌ల సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు రోగులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి...

చీమకుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి కోరారు. సంతనూతలపాడు మండలం వేములపాడులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మతో కలిసి చెంచిరెడ్డి ప్రారంభించారు. స్థానిక డాక్టర్లు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఎం.సులోచన, పార్టీ నాయకుడు మండవ వెంకటనారాయణ, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేర్నమిట్ట 41వ డివిజన్‌లో...

పేర్నమిట్టలోని ఒంగోలు 41వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ కత్తినేని వెంకట మహాలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వాణిశ్రీ, స్థానిక పార్టీ నాయకులు, డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్య పరీక్షల అనంతరం మందులు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ కత్తినేని చెంచురామిరెడ్డి, నూకతోటి ఈశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అందుబాటులోకి నాణ్యమైన వైద్యం...

నాగులుప్పలపాడు: గ్రామస్థాయిలో కూడా రోగాలతో ఏ ఒక్కరూ బాధపడకూడదని ముఖ్యమంత్రి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చాలా మంచిదని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు స్టేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కనపర్తి-2 సచివాలయం పరిధిలో గల వినోదరాయునిపాలెం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ పెద్ద పెద్ద వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి ఉచితంగా వైద్యం అందిస్తూ పేదలకు దైవంగా మారిన ముఖ్యమంత్రి.. నేడు గ్రామాల్లో ప్రజానీకం సైతం ఆరోగ్యంగా ఉండాలని చేపట్టిన ఈ కార్యక్రమం చాలా గొప్పదన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహార ఏర్పాట్లను ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదాల రత్నభారతి అశోక్‌బాబు దంపతులు పరిశీలించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీల చేతుల మీదుగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, సర్పంచ్ ఘట్టమనేని అశోక్, ఎంపీటీసీ పొద పవన్, పురం ఆంజనేయులు, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, వైద్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఒంగోలు 41వ డివిజన్‌లో పాల్గొన్న దుంపా చెంచిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వాణిశ్రీ



వినోదరాయునిపాలెంలో మందులు అందజేస్తున్న ఎంపీపీ అంజమ్మ



కొత్తపట్నం: గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న జాలిరెడ్డి, ఉమామహేశ్వరి, రమణమ్మ, సుజాత

పేదలకు కార్పొరేట్ వైద్యం

కొత్తపట్నం: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడానికి, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పల్లెల్లో బాగా ఉపయోగపడతాయని వైస్ ఎంపీపీ తాత ఉమామహేశ్వరి, సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి అన్నారు. మండలంలోని గమళ్లపాలెం సచివాలయం పరిధిలో హైస్కూల్ ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గమళ్లపాలెం సర్పంచ్ బలగాని రమణమ్మ, వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్‌లిద్దరు అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం కళ్లజోళ్లు, ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. జాలిరెడ్డి సొంత నగదుతో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డాక్టర్ వెంకటేష్, స్కూల్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు తాతా నాంచార్లు, తాత శ్రీనివాసరావు, గ్రామ పెద్ద ఉద్దగిరి జాలయ్య, తుళ్లూరి కోటయ్య, తుళ్లూరి సుబ్బారావు, బలగాని నారాయణ, ఆశోది వెంకటేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ కోడూరి రవీంద్ర, బద్దేల శ్రీధర్‌రెడ్డి, డొల్ల తిరుపతి వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొనుగుపాటి కాలనీలో...

ఒంగోలు సబర్బన్: స్థానిక పాపాకాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని పొనుగుపాటివారికాలనీలో డాన్‌బాస్కో స్కూల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హాజరై వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. కార్పొరేటర్ గందు ధనలక్ష్మి, ఎంహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, ఏఈ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఉత్తర్వులతో టీడీపీ నాయకుల మోసం

- దామచర్ల జనార్దన్ అండ చూసుకుని చంపేస్తామంటూ బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు
- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాది కుంచాల వెంకటేశ్వర్లు వేడుకోలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కుంచాల వెంకటేశ్వర్లు

ఒంగోలు: నకిలీ ఉత్తర్వులు ఇచ్చి నిరుద్యోగులను నిండా ముంచడమే కాకుండా నిలదీస్తే చంపేస్తామని ముత్తన నాగరాజు, ముత్తన శ్రీనివాస్ అనే టీడీపీ నాయకులు తమకు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అండ ఉందంటూ హెచ్చరిస్తున్నారంటూ స్థానిక సమతానగర్‌కు చెందిన కుంచాల వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మీడియా కెమెరామెన్స్ అసోసియేషన్ హాలులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటన 2021లో జరిగిందన్నారు. ప్రభుత్వం ఆప్‌కాస్ట్ ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు చేపడుతున్న తరుణంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మీకు తెలిసిన నిరుద్యోగులు ఉంటే చెప్పమంటూ తనను, తనతోపాటు కొత్తపట్నం బస్టాండుకు చెందిన కొట్టే కృష్ణమూర్తి, పలువురు తమ స్నేహితులను కలిసి వారు అడిగారన్నారు. ఇందుకుగాను మంగమూరు డొంకలో నాగ్ మాన్ పవర్ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వానికి వివరాలు పంపి నియామక ఉత్తర్వులు అందజేస్తామని చెప్పారని, నిజమేనని చెప్పి తాము నిరుద్యోగులను సిఫారసు చేయగా వారివద్ద నుంచి రూ.2.70 కోట్లు దోచుకున్నారన్నారు. అయితే వారు నకిలీ ఉత్తర్వులు అందించారని, అందులో ప్రభుత్వ అధికారుల సంతకాలు, ముద్రలు అన్నీ కూడా ఫేక్ అని తేలిందన్నారు. దీంతో డబ్బులు కట్టిన పలువురు నిలదీయడంతో తాము ముత్తంశెట్టి శ్రీనివాస్, నాగరాజులను ప్రశ్నించగా సమాధానం చెప్పకపోగా బెదిరించారన్నారు. ఈ క్రమంలో ముత్తంశెట్టి శ్రీనివాస్, నాగరాజుల భాగస్వామి అయిన శరత్ ఉరఫ్ ఆనంద్ అనే వ్యక్తి తనకు ఒక మెసేజ్ పంపాడన్నారు. శ్రీనివాస్, నాగరాజు ఇద్దరు డేంజర్ వ్యక్తులని, వారు నిన్ను హత్యచేసేందుకు ప్లాన్ చేస్తున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని దాని సారాంశం అన్నారు. దీనిపై తాను తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశానని కేవలం 513/2002 కేసు నమోదు చేశారు తప్ప దర్యాప్తు ముందుకు కదలలేదన్నారు. ఈ క్రమంలోనే తనకు 2022లో సంతనూతలపాడు మండలం ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో యాక్సిడెంట్ జరిగి కుడికాలు కూడా తొలగించారన్నారు. దీనిపై తనకు ముత్తన నాగరాజు, శ్రీనివాస్ తదితరులపై అనుమానం ఉందని పోలీసులకు తెలియజేశామని కానీ పట్టించుకోలేదన్నారు. ఇటీవల నకిలీ స్టాంపుల కుంభకోణం వెలుగులోకి రావడంతో సిట్ వేసి ఎస్పీ మలికాగర్గ్ దర్యాప్తు చేస్తుండడంతో తమ వ్యవహారంపై కూడా సిట్ వేసి విచారణ జరపాలని కోరారు. నిరుద్యోగులను మోసం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు అందులో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టుచేసి బాధితులకు అండగా నిలవాలని కోరుతున్నామన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఒంగోలు సెంట్రల్: స్థానిక డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌లో రాయపూడి యలమందయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. రాయపూడి యలమందయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు రాయపూడి కిషోర్ దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పోటీలను స్థానిక 14వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్, పాలేటి మదన్, కాకుమాను సునీల్ ప్రారంభించి మాట్లాడారు. విజేతలకు వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్, తదితరులు

ఆటో ప్రమాదంపై కేసు నమోదు

కొత్తపట్నం: ఆటోలో ప్రయాణిస్తున్న వారు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల మేరకు అద్దంకి మండలం కలవకూరు గ్రామానికి చెందిన ఏడుగురు ఈ నెల 17న ఆటోలో కొత్తపట్నం బీచ్‌కు వచ్చారు. స్నానాలు చేసి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో అల్లూరుకు వెళ్లేసరికి ఆటో అదుపుతప్పింది. క్షతగాత్రులను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వారిలో కుంచాల భూలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. దీనిపై బుధవారం ఎస్సై బి.సాంబశివరావు కేసు నమోదు చేశారు.

ఎయిడెడ్ స్కూళ్ల
సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

ఒంగోలు సెంట్రల్: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరావు, ప్రభాకర్‌రెడ్డి బుధవారం కలసి పలు సమస్యలు విన్నవించారు. ఎయిడెడ్ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, తెలుగు, హిందీ పండిట్లకు, పీఈటీలకు అప్‌గ్రెడేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లించాలని, కారుణ్య నియామకాల జీవో విడుదలయ్యే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. తగిన విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.



ఎమ్మెల్సీ పర్వతరెడ్డితో ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, కార్యదర్శులు

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు అమలుచేయాలి

ఒంగోలు: ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు అమలు చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కరభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిద్దలూరు, చేకూరపాడు, ఈతముక్కల ఎయిడెడ్ పాఠశాలలకు మంజూరైన 28 పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గిద్దలూరు సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో 8, ప్రైమరీ పాఠశాలలో 6, చేకూరపాడులోని ఎస్‌వీఎస్ ఓరియంటల్ హైస్కూల్లో 7, ఈతముక్కల ఎయిడెడ్ యూపీ స్కూల్లో 7 పోస్టులు మంజూరయ్యాయన్నారు. మీడియా సమావేశంలో పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సెంట్రల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. జర్నలిస్టు పల్నాటి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు మల్లీశ్వరి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ పాల్గొని మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మీసాల శ్రీనివాస్, యూనియన్ రాష్ట్ర కన్వీనర్ మేకపాటి మాల్యాద్రి, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఉడతా రామకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, యూనియన్ రాష్ట్ర కో కన్వీనర్ గట్టుపల్లి శివకుమార్, మీడియా కెమేరామెన్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, పలువురు జర్నలిస్టులు, పాల్గొని పల్నాటి సేవలను కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పల్నాటికి నివాళులర్పిస్తున్న మేయర్ గంగాడ సుజాత, తదితరులు

పేదల కోసం పనిచేసి పేరు తెచ్చుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

- ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫ్రెషర్స్ డేలో కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు వైద్య విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ ప్రసంగిస్తూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, సమాజంలో వైద్యుడికి ఎంతో విలువ, గౌరవం ఉందని చెప్పారు. దేవుడి తరువాత దేవుడిగా కొనియాడబడే వైద్య వృత్తిలోకి రావడమంటే ఎంతో అదృష్టం ఉండాలన్నారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం ప్రైవేటు అస్పత్రులంటే ప్రజల్లో ఒకరకమైన భయం నెలకొందన్నారు. సేవానిరతితో పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జె.మణిబాబు, పూర్వ ప్రిన్సిపాల్ సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రభాకర్, బాలాజీనాయక్, వెంకటరమణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

ఒంగోలు సబర్బన్: బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండాలని, బడి బయట ఉండటానికి వీలులేదని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం ఒంగోలు ఎంఈఓ-2 పూండ్ల సరస్వతితో కలిసి కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వే గురించి ప్రతి ఒక్క వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు తెలుసుకోవాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఆయా వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్ల సాయంతో అలాంటి వారిని గుర్తించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం చేస్తున్న ఖర్చు, విద్యపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తున్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని సర్వే చేపట్టాలన్నారు. ఒంగోలు నగరంలో ఇప్పటి వరకు 4,886 మంది విద్యార్థుల వివరాలు యాప్‌లో తప్పుగా నమోదు చేయబడ్డాయన్నారు. ఇంకా 887 మంది విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు. సమావేశంలో నగరంలోని 70 వార్డు సచివాలయాల ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన ఒంగోలు ఎంఈఓ-2 సరస్వతి

నిరుపేద కుటుంబానికి చేయూత

ఒంగోలు టౌన్: నగరంలోని నెహ్రూనగర్లో నివసించే టీ స్టాల్ నిర్వాహకుడు షేక్ రసూల్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. బాధిత నిరుపేద కుటుంబానికి వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు, దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ బుధవారంనెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించి పరామర్శించారు.

మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



అచలానందాశ్రమంలో కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి అలంకరణలో గోవిందమాంబదేవి



బాలాజీరావుపేటలో అన్నపూర్ణాదేవి అలంకరణలో కనకదుర్గాదేవి



లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న చందు డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

ఒంగోలు మెట్రో: దసరా సందర్భంగా దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తూ పూజలు అందుకుంటున్నారు. బుధవారం మహాలక్ష్మీదేవిగా అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ ఉపన్యాసకులచే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలన్నీ విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. గాంధీరోడ్డులోని గీతా మందిరంలో నిర్వహిస్తున్న ఉపన్యాస యజ్ఞం బుధవారంతో ముగిసింది.